క్లుప్తంగా

పేదలకు ఆర్థిక సహాయం



వృద్ధులకు నగదు అందజేస్తున్న ఇటకర్లపల్లి యువత

చీపురుపల్లి: ఎలాంటి ఆదరణ లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మూడు పేద కుటుంబాలకు యువత ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన దాదాపు 40 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న యువత అంతా ఒక్కటై అదే గ్రామంలో అనాథలుగా ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవాలని ముందుకు వచ్చారు. దసరా పండగ నేపథ్యంలో గ్రామంలోని మాధేటి కృష్ణ, మీసాల పున్నమ్మ, గాడి నారాయణ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున నగదును శనివారం అందజేశారు. కార్యక్రమంలో లెంక రాము, శనపతి సూర్యనారాయణ, దన్నాన పైడిరాజు, కొంచాడ రమణయ్య, షేక్ పీర్‌సాహేబ్, దన్నాన చిన్నశ్రీను, అలిగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

బొండపల్లి: మండలంలో ఆదివారం ఉదయం అదుపు తప్పిన ఓ లారీ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఒడిశా నుంచి విశాఖపట్నం ఐరన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బొండపల్లి మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి 26ను ఆనుకుని ఉన్న లోయలోని పొలాల్లోకి దూసుకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. బోల్తా పడిన లారీని క్రేన్ల సహాయంతో పోలీసులు బయటకు తీశారు. లారీని బయటకు తీసుకువచ్చినప్పుడు జాతీయ రహదారిపై అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చేపలు మృత్యువాత

- మత్స్యకారుల ఆందోళన



చెరువులో చనిపోయిన చేపలు

జామి: మండలంలోని ఏఆర్.పేట పద్మనాభరాజు చెరువు మత్స్యకారుల సొసైటీ పరిధిలో ఉంది. ఆ చెరువులో ఏఆర్.పేట మత్స్యకార సొసైటీవారు చేపలు వేశారు.ఇటీవల వరుస మూడు రోజులుగా చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువు లో ఉన్న చేపలకు వ్యాధులు సోకి మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు ఎ.శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని వాపోతూ ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

డయేరియాతో వ్యక్తి మృతి..!



అప్పారావు (ఫైల్)

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా విజృంభిస్తోంది.డయేరియాతో మండల బీజేపీ నాయకుడు చింతపల్లి అప్పారావు ఆదివారం మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఆయన డయేరియాతో మృతి చెందలేదని, ఇతర అనారోగ్య సమస్యలు కారణమని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నయ్ వివరణ ఇచ్చారు. అయితే గుర్లలో ప్రస్తుతం పెంటయ్య, ఎం.అప్పయ్యమ్మతో పాటు మరో 10 మంది డయేరియాతో బాధపడుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- 33వ డివిజన్ కార్పొరేటర్ రంగారావు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానంతో రోగి ప్రాణాలు కాపాడవచ్చని 33వ డివిజన్ కార్పొరేటర్ జీవీ రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్ సెంటర్‌లో ఏపీజే అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి మాత్రమే రక్తదానం చేసి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యకరమైన స్త్రీ, పురుషులు ఎవరైనా మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, గోవింద్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

కలిసి రాని ఖరీఫ్..!

- వరిలో తెగుళ్ల బెడద
- అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులే కారణం
- దిగుబడిపై ప్రభావం తప్పదంటున్న అన్నదాతలు



బొండపల్లి మండలం గెట్టుపల్లిలో వరి పంటను ఆశించిన తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

బొండపల్లి: ఈఏడాది ఖరీఫ్ సీజన్ వరి సాగు అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. సీజన్ ప్రారంభంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లోని బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం మండలాల పరిధిలో బోర్ల ఆధారంగా 50 శాతం రైతులు మాత్రమే సకాలంలో నాట్లు వేయగలిగారు వర్షాలు కురిసిన తర్వాత మిగతా 50 శాతం మంది రైతులు ముదిరిన నారుతో ఆలస్యంగా నాట్లు వేశారు. నాట్లు పూర్తయిన తర్వాత మళ్లీ వరుణుడు ముఖం చాటేయడం, మధ్యలో భారీ వర్షాలు, తాజాగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల పంటలో తెగుళ్లు విజృంభిస్తున్నాయి.గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 14వేల హెక్టార్లు కాగా 13,500 హెక్టార్లలో నాట్లు వేశారు. 1121 రకం వరిని 10 వేల హెక్టార్లలో, స్వర్ణ, ఆర్‌జీఎల్, సాంబ మసూరి, తదితర రకాలను 3,500 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటలో తెగుళ్ల తీవ్రత ఉంది. ప్రధానంగా 1121 రకంలో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన మే నెలాఖరు నుంచి ఇప్పటి వరకు మధ్యలో పది, పదిహేను రోజులు తప్ప మిగతా రోజుల్లో వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతునే ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన చోట ప్రసుత్తం వరి పైరు చిరు పొట్ట, కంకి దశకు చేరుకుంది. పంటను కంకి నల్లి, పొడ, ఆకుముడత, ఎండాకు, అగ్గి తెగుళ్లు ఆశించాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమం పేరిట అధికారులు పంటను పరిశీలిస్తూ తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నప్పటికీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పంట దిగుబడిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు.

అందని పెట్టుబడి సహాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంటల సాగుకు అనుగుణంగా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించేది. రైతులు ఉత్సాహంగా పంటల సాగుకు ఉపక్రమించేవారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని 'అన్నదాత సుఖీభవ'గా పేరుమార్చిందే తప్ప రైతుకు రూపాయి పెట్టుబడి సాయం చేయలేదు. ఎన్నికల సమయంలో రైతుకు రూ.20వేలు చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించి ఖరీఫ్ చివరి దశకు వచ్చినా పైసా విదల్చలేదు. దీంతో చేతిలో పెట్టుబడికి డబ్బులు లేక చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఇప్పటికే ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లకు అప్పులు చేయాల్సి వస్తోంది.

కీలకదశలో ఎరువుల కొరత

వరి పంట కీలకదశలో ఉన్న సమయంలో యూరియా, పొటాష్ అందుబాటులో లేవు. పంటకు సమయానికి ఎరువులు అందించలేకపోవడంతో ఆ ప్రభావం ఇప్పుడు కనిపిస్తోందని రైతులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు గ్రామాల్లోనే అందేవి. కూటమి వచ్చిన తర్వాత ఆ కేంద్రా ల ద్వారా ఎరువుల సరఫరా పెద్దగా జరగలేదని, ప్రైవేటు దుకాణాల వ్యాపారులు కొన్నాళ్లు కృత్రిమ కొరత సృష్టించి తర్వాత అధిక ధరలకు విక్రయించారని రైతులు ఆరోపి స్తున్నారు. ఎరువుల విషయంలో ప్రభుత్వం, అధికారుల సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తమకు శాపంగా మారిందని రైతులు అంటున్నారు.

సస్యరక్షణ చేపట్టాలి



రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రాథమిక దశలోనే తెగుళ్లను గుర్తించి నివారణకు వ్యవసాయ సిబ్బంది సిఫార్సు చేసిన పురుగు మందులను పిచికారీ చేసుకోవాలి. ప్రసుత్తం వాతావరణ పరిస్థితులు, ఎండలతీవ్రత వల్ల తెగుళ్లు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– కె.మహరాజన్,ఏడీఏ, గజపతినగరం

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగించుకోవాలి



నినాదాలు చేస్తున్న సమాచార హక్కు చట్టం కార్యకర్తలు

శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆ చట్టం జిల్లా సమ న్వయ కమిటీ సభ్యుడు దొడ్డి సూర్యారావు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవాన్ని న్యాయవాది, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ సమాచార హక్కు చట్టం ఉద్యమకారులు సీహెచ్.రామకష్ణ, లంక సాంబ మూర్తి తదితరులతో కలిసి శనివారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టాన్ని వినియోగిద్దాం.. అవినీతిని అంతం చేద్దాం..అభివృద్ధిని సాధిద్దాం.. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం, పార దర్శకత పెంపొందిద్దాం, చట్టాన్ని వినియోగించే నిజాయితీపరులకు అమలు చేసే నిజాయితీ గల అధి కారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని అంటూ నినాదాలు చేశారు. సూర్యారావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 లో అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని అన్నారు. దేశంలో పెద్దపెద్ద కుంభకోణాలన్నీ ఈ చట్టం వచ్చిన తర్వాతే బయటకి వచ్చాయ ని,ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే మెక్సికో వంటి దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయ ని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఈ చట్టాన్ని చట్టాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని కోరారు.

18న పాడిరైతుల సదస్సు



నిమ్మలపాలెంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అప్పారావు, పాడిరైతులు

కొత్తవలస: పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీన జామి మండలంలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని జిల్లా రైతు కూలీ సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని నిమ్మలపాలెం, కర్రిచిన్నయ్యపాలెం గ్రామాల్లో పాడిరైతుల సమక్షంలో సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాల ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో డెయిరీలకు తీవ్రనష్టం వాటిల్లుతోందని, ఈ ప్రభావం రైతులపై పడుతోందన్నారు. పాలసేకరణలో డెయిరీలు చెల్లిస్తున్న ధరకు అదనంగా లీటర్‌పై ప్రభుత్వం అదనంగా రూ.10 చెల్లించాలని, విదేశాల నుంచి పాలపొడర్ల దిగుమతిని నిషేధించాలని, రాష్ట్రంలోని డెయిరీలన్నింటినీ సహకార రంగంలోకి తీసుకురావాలని, 75 శాతం రాయితీపై పశువుల దాణా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలరైతుల సమస్యలపై చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న సదస్సుకు అధిక సంఖ్యలో పాడిరైతులు హాజరు కావాలని కోరారు. సీఐటీయూ నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

• జయహో దుర్గా భవానీ



దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



బొండపల్లి:నెలివాడలో దేవీ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



బొండపల్లి: అంబటివలసలో బసవన్నపై శివలింగాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వేపాడ: నీలకంఠరాజపురంలో సహస్రదీపారాధన చేస్తున్న భక్తులు

విజయదశమిని పురస్కరించుకుని గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి.గ్రామాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పనిముట్లు, యంత్రాలు, వాహనాలకు ప్రజలు పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో గ్రామాల్లోని దేవీ మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల నిమజ్జనోత్సవాలను కొన్ని చోట్ల శనివారం రాత్రి, మరికొన్ని చోట్ల ఆదివారం రాత్రి నిర్వహించారు. అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా ఉత్సవకమిటీలు పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. వేపాడ మండలంలోని నీలకంఠరాజ పురంలో భవానీ మాలధారణ భక్తులు సహస్ర దీపారాధన చేశారు. గంట్యాడ మండలం,పెదవేమలి గ్రామంలోని కాళీమాత ఆశ్రమం లో ఏర్పాటు చేసిన దేవీ మండపంలో అమ్మవారికి భక్తులు శనివారం 108 రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు.

– సాక్షి నెట్ వర్క్



గంట్యాడ: పెదవేమలిలో అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం



బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో శనివారం అపరాజితదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



బొండపల్లి: నెలివాడలో కలశాలతో అనుపోత్సహంలో పాల్గొన్న మహిళలు



శృంగవరపుకోట: ఎల్.కోట మండలంలోని లచ్చమ్మపేటలో అమ్మవారి నిమజ్జనోత్సవం

వైభవంగా గ్రామదేవతల పండగ



గజపతినగరం: మరుపల్లిలో పూజలందుకుంటున్న మజ్జి గౌరమ్మ



గజపతినగరం:మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

గజపతినగరం: మండలం మరుపల్లిలో గ్రామదేవత మజ్జి గౌరమ్మ పండగను గ్రామ స్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామా లకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో భక్తులు ఇబ్బందులు పడకుండా స్థానిక పెద్దలు, కమిటీ వారు టెంట్లు, తాగునీరు సదుపాయం ఏర్పాటు చేశారు.



గుర్ల: కెల్ల గ్రామంలో పైడితల్లి ఆలయానికి ప్రభతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

కెల్లలో..

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి ప్రభలతో ఊరేగింపు ఆలయానికి చేరుకునిపసుపు, కుంకమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రారంభించేది ఎప్పుడో..?



ప్రారంభానికి నోచుకోని ఉద్యానవన పంటల నిల్వ కేంద్రం

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామం వద్ద రూ.15లక్షలతో ఉద్యానవన పంటల సేకరణ కేంద్రాన్ని గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. మండలంలో ఎక్కువగా మామిడి రైతులు ఉండడంతో రైతులు మామిడి కాయలు నిల్వచేసుకోవడానికి వీలుగా ఈ భవనాన్ని నిర్మించారు. ఎన్నికల కోడ్ రావడంతో అప్పటిలో ఈ భవ నాన్ని ప్రారంభించలేదు. భవ నాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తర్వగా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

తలనొప్పిగా మారిన లబ్ధిదారుల ఎంపిక

మెరకముడిదాం: మండలంలో గోశాలల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అధికారులకు తలనొప్పిగా మారింది. వందలాది మంది పాడిరైతులు ఉండగా ప్రభు త్వం 26 గోశాలలను మాత్రమే మంజూరు చేసింది. రెండు ఆవుల యూనిట్ గోశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1,03,500 మంజూరు చేస్తుంది. పాడి రైతు ముందుగా రూ. 11,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. నాలుగు ఆవుల యూనిట్ గోశాలకు ప్రభుత్వం 1,85,000 మంజూరు చేస్తుంది. పాడిరైతు రూ.18,500 డిపాజిట్ చేయాలి. అలాగే ఆరు ఆవుల యూనిట్ గోశాలకు ప్రభుత్వం రూ. 2,30,000 మంజూరు చేస్తుంది. రైతు రూ.23 వేలు డిపాజిట్ చేయాలని నిబంధన పెట్టారు. ఇంత వరూ బాగానే ఉంది కానీ కేవలం 26 గోశాలలను మాత్రమే మంజూరు చేయడంతో వాటిని ఎవరికి కేటాయించాలో తెలియక పశుసంవర్ధకశాఖ, ఉపాధి హామీ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. అధికార టీడీపీ నాయకులు మాకు కావాలంటే, మాకు కావాలంటూ పైరవీలు చేస్తుండడంతో అధికారులకు ఈ వ్యవహారం మరింత తలనొప్పిగా తయారైంది.

షిర్డీసాయి ఆలయంలో పుణ్యతిథి వేడుకలు



పండ్లు, పూలతో సాయిబాబా సమాధి అలంకరణ



మందిరం వద్ద బాలభవన్ చిన్నారుల నృత్య ప్రదర్శన

చీపురుపల్లి: స్థానిక రుంకానవీధిలోని దత్తసాయి మందిరంలో షిర్డీసాయి 106వ పుణ్యతిథి వేడుకలను మందిర నిర్వాహకుడు తంగుడు రామకృష్ణ నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఉదయం 8 గంటలకు 108 పుష్పాలతో సువర్ణ పుష్పార్చన, 10 గంటలకు సమాది మందిర అలంకరణ, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు సహస్ర నామ పారాయణం, సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం 6 గంటల నుంచి బాలభవన్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా గౌర్రిపాటి జయంతి



జామి: జామి బజారు సెంటర్‌లో బుచ్చి అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు



జామి: జామిలో నాయకులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



జామి: వెలమాంధ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలమండలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

జామి: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు బాంధవుడు గౌర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బజారు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గౌర్రిపాటి బుచ్చి అప్పారావు వెనుక బడిన వర్గాలు, రైతులు, కార్మికుల కోసం చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు.డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, జామి,గంట్యాడ జెడ్పీటీసీలు గొర్లె సరయు, వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, సీనియర్ నాయకులు పొంద్రంకి సంజీవి, చలుమూరి సత్యారావు, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ,అల్లు సత్యాజీ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

బుచ్చిఅప్పారావు జయంతి నేపథ్యంలో అలమండ గ్రామంలో వెలమాంధ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు అప్పారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వెలమాంధ్ర ఫౌండేషన్ అధ్యక్షుడు ఏ.వి.ఆర్.మూర్తి,కార్యదర్శి సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచ లపు చినరామునాయుడు, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు, ఉప సర్పంచ్ లగుడు దేముడు, నాయకులు గొంప కృష్ణ, లగుడు రవి కుమార్, ఎల్.పెదవెంకటరావు, జి.ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: స్థానిక ఏజీఎల్ కళాశాల ఆవరణలో ఎస్.కోట పుణ్యగిరి వెలమ సంఘం అధ్యక్షుడు కొల్లి కోటేశ్వరరావు ఆధ్వ ర్యంలో గౌర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి వెలమ నాయ కులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ బుచ్చి అప్పారావు కృషి, పోరాటం వల్లే తాటిపూడి జలా శయం నిర్మాణం జరిగిందన్నారు.ఎంతో మంది వెనక బడిన వర్గాల వారికి ఆయన కృషివల్లే ఉపాధి లభించిందన్నారు. తాటి పూడి రిజర్వాయర్‌కు ఆయన పేరును కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కూరెడ్డి వెంకటరావు, వైద్యుడు రంది త్రినాథరావు, యూటీఎఫ్ నాయకులు గూనూరు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరంక్రైమ్: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పరిధిలోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతున్న గుర్ల మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.42వేల 800 నగదు, ఆరు సెల్ ఫోన్‌లు, గేమింగ్ కార్డ్స్ సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.